సాక్షి సిద్దిపేట

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



నల్లపోచమ్మదేవికి ప్రత్యేక పూజలు

తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వివరాలు 8లో ▶



మార్కెట్‌లో మట్టి గణపతుల విక్రయం..

ఏకోదంతా భజేహం

ఊరూరా చవితి సందడి

కొలువుదీరనున్న గణనాథుడు

కొనుగోళ్లతో కిటకిటలాడిన మార్కెట్లు



సిద్దిపేట పట్టణంలోని మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి

ఎటుచూసినా చవితి సందడి నెలకొంది. ఊరూరా వినాయక మండపాలను అందగా ముస్తాబు చేశారు. అధికంగా ఏకోగణపతి విగ్రహాలనే మండపాల్లో ప్రతిష్ఠిస్తుండటం విశేషం. వాహనాలలో, దప్పు చప్పుళ్లతో వినాయక విగ్రహాలను మండపాలకు తరలించారు. మరోవైపు మార్కెట్లన్నీ పూలు, పండ్లు, పత్రి కొనుగోళ్లతో కిటకిటలాడాయి. పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ అనేక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి, గోమయ విగ్రహాలను పంపిణీ చేశారు. వీటిని తీసుకెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూశారు. - ప్రశాంత్ నగర్(సిద్దిపేట)



అందంగా ముస్తాబు చేసిన మండపం

న్యూస్‌రీల్

దూళ్మిట్టకు కేజీబీవీ మంజూరు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల కేంద్రానికి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి హరీశ్ రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే 6, 7వ తరగతులలో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ప్రతి తరగతికి 40 మంది విద్యార్థినులు ఉండేలా తరగతులు ప్రారంభించేందుకు అనుమతి లభించినట్లు పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

మా ఓట్లన్నీ హరీశ్‌రావుకే

భవన నిర్మాణ రంగ కార్మికుల ఏకగ్రీవ తీర్మానం



తీర్మాన పత్రాన్ని ఎంపీపీకి అందజేస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఓట్లు మంత్రి హరీశ్‌రావుకే వేస్తామని మండల భవన నిర్మాణ రంగ కార్మికులు ఆదివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. 1700 మంది కార్మికుల కుటుంబాలు హరీశ్ రావుకు ఓటు వేస్తామని తీర్మాన పత్రాన్ని ఎంపీపీ మాణిక్యరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ అహర్నిశలు నియోజకవర్గ ప్రజల కోసం పరితపిస్తున్న మంత్రిని వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, ఎంపీపీ ఉపాధ్యక్షులు పాపయ్య, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీలు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మహేశ్

గజ్వేల్‌రూరల్: ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గజ్వేల్ మండలం దాచారం గ్రామానికి చెందిన ఏలేశ్వరం మహేశ్‌ను నియమించినట్లు బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోగల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రాష్ట్ర ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎఫ్ఏల సంఘం జిల్లా అధ్యక్షునిగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా బాల్‌రాజ్‌గౌడ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

బిల్లులు చెల్లించకపోతే వంటలు నిలిపివేస్తాం



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల(సిద్దిపేట): మధ్యాహ్న భోజన కార్మికులకు పెరిగిన వేతనంతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దాసరి కళావతి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో కళావతి మాట్లాడారు. ఈ విషయమై జూలై నెలలో విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని అన్నారు. కాలయాపన చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే పెంచిన వేతనం చెల్లించేందుకు బడ్జెట్ విడుదలచేసి, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఈ నెల 28 నుంచి మధ్యాహ్న భోజన వంటలను నిలిపివేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కార్మికులు వజ్రమ్మ, మల్లయ్య, పద్మ, భాగ్యలక్ష్మి, గంగ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటమే స్ఫూర్తి కావాలి

సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దాసరి కళావతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంగడి బజారు వద్ద ఉన్న దొడ్డి కొమురయ్య స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాయుధ పోరాటంతో సుమారు 10 లక్షల ఎకరాల భూమి పేదలకు దక్కిందన్నారు. నాటి పోరాటంలో లేని వారు నేడు అధికారంలో ఉండి చరిత్రను వక్రీకరిస్తున్నారని, దీన్ని ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు.

సమైక్యతా స్ఫూర్తి.. ప్రగతిలో కీర్తి

సర్వతోముఖాభివృద్ధి దిశగా రాష్ట్రం పయనం

- స్వరాష్ట్రంలో జీవన ముఖచిత్రం మార్పు
- సంక్షేమ పథకాలు అందని గడపలేదు
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి

జెండా ఆవిష్కరణ అనంతరం వందనం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తితో గడిచిన తొమ్మిదేళ్ల స్వరాష్ట్ర పాలనలో సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తున్నామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ నాటి వీరయోధుల పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వరాష్ట్రంలో తెలంగాణ జీవన ముఖచిత్రంలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. పచ్చని పొలాలతో, మౌలిక వసతులతో, శాంతికి నెలవుగా రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందన్నారు. చారిత్రాత్మకమైన కీర్తి ప్రతిష్ఠలను సిద్దిపేట జిల్లా సొంతం చేసుకుంటూ ముందుకు సాగుతుందన్నారు.

సిద్దిపేటజోన్/సిద్దిపేటరూరల్

ఎడ్యుకేషన్ హబ్‌గా..

జిల్లాలో హార్టికల్చర్, అటవీశాఖ యూనివర్సిటీలు, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫార్మసీ కళాశాలలతో ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల వ్యవస్థను మరింత బలోపేతం చేసి రాబోయే రోజుల్లో మెడికల్ హబ్‌గా ముందుకు సాగుతామన్నారు. కేసీఆర్ పథకం అందని గడప లేదని, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఆదర్శనీయమైన అభివృద్ధిని మరింత కొనసాగాల్సిన అవసరం ఉందని, కుట్రలను తిప్పికొట్టిజాతీయ సమైక్యతా స్ఫూర్తితో ప్రజల మధ్య ఐక్యతను చెదరనివ్వకుండా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. జిల్లా అభ్యున్నతి కోసం మనమంతా మరింత కంకణబద్ధులై ముందుకు సాగాలన్నారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి హరీశ్ రావు, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, పోలీస్ కమిషనర్ శ్వేతా, జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు సాయిరాం, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

సిద్దిపేటజోన్: పట్టణ బీజేపీ ఉపాధ్యక్షుడు యాదగిరి ఆదివారం మంత్రి హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు 50 మంది బీజేపీ కార్యకర్తలు కూడా చేరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు అండగా కేసీఆర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వృద్ధులకు, ఒంటరిమహిళలకు, వికలాంగులకు, వితంతువులకు ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉంటు ఫించన్ అందిస్తున్నారని, మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 550మందికి నూతన పింఛన్ ఉత్తర్వుల పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ పింఛన్ నేడు రూ.2016కు పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో అందని విధంగా గీతా, నేత, బీడీకార్మికులు, టేకేదారులు, తదితరులకు ఫించన్ అందిస్తూ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

అన్నికులాలకు సముచిత న్యాయం

- మంత్రి హరీశ్‌రావు
- కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, పోలీస్‌కమిషనర్ తదితరులు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని కులాలకు సముచిత న్యాయం అందిస్తోందని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు, పోలీస్ కమిషనర్ శ్వేత, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ విశ్వకర్మ చిత్రాపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపట్టిందన్నారు. గతంలో పాలకులు కుల సంఘాలను విస్మరించారని సీఎం కేసీఆర్ అన్ని కుల సంఘాలకు ఆత్మగౌరవ నిలయాలను పెద్ద ఎత్తున నిర్మించడం కోసం నిధులను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ నాగిరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి మురళి, తదితర అధికారుల, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లిలో భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. భక్తుల రాకతో ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. భక్తులు పట్నాలు, అభిషేకాలు, అర్చన, ఒడిబియ్యం, ప్రత్యేక పూజలు, గంగిరేణు చెట్టుకు ముడుపులు కట్టి స్వామి వారిని వేడుకున్నారు. కొండ పైన రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రుణమాఫీ ప్రక్రియను వేగవంతం చేయండి

రాష్ట్ర ఆర్థిక,ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ● జిల్లా స్థాయి బ్యాంకర్లతో సమావేశం

సిద్దిపేటరూరల్: రైతు రుణమాఫీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా వేగిరం చేయాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం కలెక్టరెట్‌లో మంత్రి అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఈనెల 21న ఎస్ఎల్‌బీసీ సమావేశం ఉన్నందున బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు రుణమాఫీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ కారణాల వల్ల రైతుల అకౌంటు క్లోజ్ కావడం, ఒక బ్యాంకు ఇంకో బ్యాంకులో మెర్జి కావడం, బ్యాంకుల పేరు మారడం తదితర కారణాల వలన రాష్ట్రవ్యాప్తంగా 10 వేల నుంచి 12,000 మంది, సిద్దిపేట జిల్లాలో 638 రైతుల అకౌంట్లు దొరకడం లేదన్నారు. నంగునూరు మండలం పాలమాకులలో సిండికేట్ బ్యాంక్ కెనరా బ్యాంకులో మెర్జ్ కావడం వల్ల రూ.4 కోట్ల రుణమాఫీ ఆగిందన్నారు. ఇప్పటివరకు రూ.లక్ష 10 వేల లోపు రైతు రుణమాఫీ జరిగిందన్నారు. ఈనెలాఖరులోపు రూ.లక్షా50వేల లోపు రుణమాఫీ సైతం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణ, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ శ్రీనివాస్, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, నాబార్డ్ డీడీఎం సెసిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా పోరాట ఫలితమే..

పేదలకు భూములు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి
- సాయుధ పోరాట వారోత్సవాలు ముగింపు



రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేటఅర్బన్: కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఎర్రజెండా సాగించిన పోరాటం ఫలితంగా పేదల చేతుల్లో భూములున్నాయని, పది లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సిద్దిపేటలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రాంతాలలో నాటి తెలంగాణ సాయుధ పోరాట కేంద్రాలుగా ఉన్నాయని, రజాకార్లు జరిపిన దాడిలో బైరాన్‌పల్లిలో 116 మంది ఒకే రోజు అమరులయ్యారని గుర్తు చేశారు. ఆంధ్ర మహాసభ మొట్టమొదటి సమావేశం ఉమ్మడి మెదక్ జిల్లాలలో జరిగిందని, నాటి నుంచి నేటి వరకు కమ్యూనిస్టు ఉద్యమాలకు ఈ జిల్లా ఊపిరి పోసిందని అన్నారు. నేటి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాచరిక వ్యవస్థకు పునాదులు వేస్తున్నారని అన్నారు. రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో వారి పోరాట వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించి అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తామని అన్నారు. కార్యకర్తలు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, ప్రశాంత్, శిరీష, అరవింద్, కిష్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరణ..

రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి మంద పవన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ సీపీఐ ఎల్లప్పుడూ సమస్యలపై పోరాడే పార్టీ అని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజల సమస్యలపై కార్యాచరణ రూపొందించుకొని ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, పట్టణ కార్యదర్శి బన్సీలాల్, నాయకులు మల్లేశం, భిక్షపతి, సుధాకర్, ఐలయ్య, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ విమోచనమే..



బీజేపీ జిల్లా కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): తెలంగాణ విముక్తి పోరాటం ముమ్మాటికీ విమోచన దినోత్సవమేనని, సమైక్యతా దినోత్సవం కాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి అన్నారు. విమోచన దినోత్సవం సందర్భంగా ఆదివారం సిద్దిపేటలో బీజేపీ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను మరుగుపరిచే కుట్రలు జరుగుతున్నాయని, ఈ కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. విమోచన చరిత్ర ప్రస్తుత, భావి తరాలకు తెలియకుండా ప్రభుత్వాలు తొక్కిపెట్టాయని విమర్శించారు. రాజకీయాల కోసం అమరుల త్యాగాలను విస్మరిస్తున్నారని అన్నారు. పోరాటయోధుల త్యాగాలను కాంగ్రెస్ గుర్తించలేదన్నారు. కాంగ్రెస్ బాటలోనే బీఆర్ఎస్ నడుస్తుందని విమర్శించారు. భూమికోసం, భుక్తి కోసం జరిపిన పోరాటం ఏ రకంగా సమైక్యతా దినోత్సవం అవుతుందో బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పత్రి శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్‌రావు, విభీషణ్‌రెడ్డి, చెందిసత్యనారాయణ, గోనె మార్కండేయులు, మంజుల రెడ్డి, అరుణ రెడ్డి, సుగుణ, భోగి శ్రీనివాస్, రమేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కారణజన్ముడు ప్రధాని మోదీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారతదేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కారణజన్ముడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మోహినిపూర వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని.. ప్రపంచంలో దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



సిద్దిపేటరూరల్: విద్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం వద్ద 17 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లుగా విద్యా శాఖ సమగ్ర శిక్షలో వివిధ కేటగిరిలో ఉన్న నాన్ టీచింగ్ స్టాఫ్ అందర్నీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతే ఉండదని చెప్పిన ముఖ్యమంత్రి మాటలు ఏమయ్యాయన్నారు. అలాగే వారికి సమాన పనికి సమాన వేతనం అందేలా సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, జిల్లా నాయకులు రెడ్డబోయిన అరవిందులు పాల్గొన్నారు.



సిద్దిపేట కోమటి చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన డైనోసార్ పార్కును మంత్రి హరీశ్‌రావు ఆదివారం రాత్రి ప్రారంభించారు. అనంతరం వీల్ ట్రాక్ ట్రైన్‌లో ప్రయాణించి వీక్షించారు.

క్లుప్తంగా

ఇద్దరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

నారాయణఖేడ్: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నాగల్‌గిద్ద మండలం గోందేగాంకు చెందిన మాజీ సర్పంచ్ శంకరప్పతోపాటు శాంతయ్యస్వామి ఆదివారం నారాయణఖేడ్‌కు బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారిని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.

పురిటి నొప్పులతో గర్భిణి అష్టకష్టాలు

కల్హేర్(నారాయణఖేడ్): పురిటి నొప్పులు రావడంతో ఓ గర్భిణి ఆస్పత్రికి వెళ్లేందుకు అష్ట కష్టాలు పడాల్సి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన గర్భిణి శ్రావణికి పురిటి నొప్పులు వచ్చాయి. ఆమె కుటుంబ సభ్యులు శనివారం రాత్రి 108లో సిర్గాపూర్ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నార్మల్ డెలివరీ చేసే అవకాశం లేదని, నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారు. 108కు మరోసారి కాల్ చేశారు. ఎన్నిసార్లు చేసినా స్పందించలేదు. దీంతో అర్ధరాత్రి శ్రావణికి నొప్పులు ఎక్కువయ్యాయి. చేసేదేమీ లేక సిర్గాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి స్పందించి గర్భిణిని పోలీసు వాహనంలో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నార్మల్ డెలివరీ కావడంతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. పోలీసులు సహకారానికి శ్రావణి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్యా యత్నం



కాలిన గాయాలతో ప్రవీణ్

మనోహరాబాద్(తూప్రాన్): భార్య పుట్టింటికి వెళ్లిందని ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధి జీడిపల్లిలో చోటు చేసుకుంది. ఆదివారం స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన ఎర్ర ప్రవీణ్, అతని భార్య మధ్య గొడవ జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో శనివారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన పక్కింటి వాళ్లు వెంటనే మంటలను ఆర్పారు. చికిత్స నిమిత్తం మేడ్చల్‌కు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీకి తీసుకెళ్లారు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

తల్లికి పిండ ప్రదానం చేసేందుకు వెళ్లి...

కోనేరులో పడి కొడుకు మృతి

దుబ్బాక: తల్లికి పిండ ప్రదానం చేయబోయి కోనేరులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధి చెల్లాపూర్‌లో ఆదివారం జరిగింది. దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు. చెల్లాపూర్ 3వవార్డుకు చెందిన తిరుమల శేషాచారి(55) స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు చేస్తుంటాడు. ఇతనికి భార్య రమాదేవి, కొడుకు ప్రీతివర్ధన్ ఉన్నారు. శేషాచారి తల్లి సుభద్రదేవి 7వ వర్ధంతి సందర్భంగా పిండాలను వార్డులో గల కోనేరులో కలపడానికి ఒక్కడే వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడి నీట మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..

- ప్రతిఏటా వెయ్యి మట్టిగణపయ్యల పంపిణీ
- ఉపాధినిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్న మణికంఠ



మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న చింత మణికంఠ స్వరాజ్

దుబ్బాకటౌన్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఓ యువకుడు ముందుకు సాగుతున్నాడు. వినాయక చవితి సందర్భంగా రంగురంగుల గణపయ్యలను పూజించొద్దని.. మట్టి విగ్రహాలే మేలని పిలుపునిస్తున్నాడు. అంతేకాకుండా తండ్రి సహకారంతో పదేళ్లుగా ప్రతీ ఏడాది మట్టి విగ్రహాలను తయారు చేయించి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. మట్టి విగ్రహాలను పూజించడం వల్ల కలిగే ఉపయోగాల గురించి చిన్నప్పుడు అమ్మానాన్న చెప్పిన విషయాలను స్ఫూర్తిగా తీసుకున్నాడు. సొంత ఖర్చులతో విగ్రహాలను తయారు చేయించి కొందరికి ఉపాధి కూడా కల్పిస్తూ దుబ్బాక పట్టణంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. దుబ్బాకకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చింతరాజు స్వరూపల ఏకైక కుమారుడైన మణికంఠ ఎంకాం, ఎంబీఏ చదివాడు. తన తండ్రి ప్రకృతి ప్రేమికుడు కావడంతో ఆయన బాటలోనే మణికంఠ నడుస్తున్నాడు. తన వంతుగా ప్రకృతిని కాపాడాలనే ఆలోచనతో దశాబ్దకాలంగా వినాయక చవితికి 50 వేలకు పైగా సొంత ఖర్చుతో వెయ్యి మట్టిగణపతులను తయారుచేయిస్తూ ప్రజలకు ఉచితంగా అందిస్తున్నాడు. మట్టి గణపతులను తయారుచేయిస్తు పేదకుటుంబానికి ఉపాధిని ఇవ్వడమే కాకుండా జలాశయాలు కలుషితం కాకూడదనే ఆలోచనతో మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న మణికంఠ .. దుబ్బాక ప్రాంతంలో అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నాడు.

నేడు మట్టిగణపయ్యల పంపిణీ

వినాయకచవితి సందర్భంగా సోమవారం దుబ్బాకలో మట్టి విగ్రహాల పంపిణీ చేయనున్నారు. తండ్రి చింతరాజు సహకారంతో మణికంఠ ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

మట్టి విగ్రహాలను పూజిద్దాం : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ప్రతీ ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించాలని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గాంధీ చౌక్ వద్ద అమర్నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. సిద్దిపేటలో పర్యావరణ పరిరక్షణకు చైతన్యం వచ్చిందన్నారు. పట్టణంలో మూడు రోజుల పాటు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, విజిత, సాయిరాం, రత్నాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మంత్రి

మట్టి గణపతులు శ్రేయస్కరం

ప్రజలు మట్టి గణపతులను పూజించడమే శ్రేయస్కరం. మా ఇంట్లో చిన్నప్పటి నుంచి కుమ్మరిమట్టితో తయారుచేసిన గణపతినే పూజిస్తాం. వీటివల్ల కలిగే మేలు గురించి అమ్మానాన్నలు వివరించేవారు. అలా స్ఫూర్తి పొంది పదేళ్లుగా ఏటా వెయ్యి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న. భవిష్యత్తులో మంచిస్థాయికి వచ్చాక పర్యావరణ రక్షణకు మరింత కృషిచేస్తా.

–చింత మణికంఠ స్వరాజ్

ఏటా వెయ్యి మట్టివిగ్రహాల పంపిణీ



పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం వినాయకచవితి సందర్భంగా వెయ్యి మట్టి గణపయ్యలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నాం. పీఓపీ గణపతులను నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. దీంతో క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది.

–చింత రాజు,
దుబ్బాక ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు

హోటల్‌లో చోరీ



ఇనుప జాలిని కట్ చేసిన దుండగులు

నర్సాపూర్: పట్టణంలోని సంగారెడ్డి రహదారిని ఆనుకుని ఉన్న ఫేమస్ మండీ హోటల్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. నిర్వాహకుడు సయ్యద్ వాఖర్ హుస్సేన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యజమాని హోటల్‌ను శనివారం రాత్రి ఒకటిన్నరకు మూసివేసి సంగారెడ్డిలో ఓ ఫంక్షన్‌కి వెళ్లాడు. అక్కడ ఉన్నప్పుడు హోటల్‌కు చెందిన సీసీ కెమెరాల పనితీరును మొబైల్‌లో పరిశీలించాడు. అవి పని చేయకపోవడంతో అనుమానం వచ్చి ఆదివారం తెల్లవారు జామున హోటల్‌లో పరిశీలించాడు. గుర్తుతెలియని వ్యక్తులు హోటల్ వెనక భాగాన ఉన్న ఇనుప జాలీని కట్ చేసి లోపలికి ప్రవేశించారు. 45వేల రూపాయల నగదుతో పాటు సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లారు. హోటల్ నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం వచ్చి పరిశీలించింది. స్థానిక ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా హోటల్‌లో ఎలాంటి ఆధారాలు దొరకలేదని చెప్పారు. హోటల్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అమ్మ మృతిపై అనుమానం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమారులు
- పదిరోజుల తరువాత శవాన్ని తీసి పోస్టుమార్టం



పోస్ట్‌మార్టం నిర్వహిస్తున్న అధికారులు

దుబ్బాకరూరల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో జరిగింది. సీఐ కృష్ణ తెలిపిన వివరాలు. బైండ్ల బాలవ్వ(50) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటుంది. భర్త ఆరేళ్ల క్రితం చనిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లకు వివాహం కాగా, కుమారులు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటారు. ఈనెల 7న బాలవ్వ మృతి చెందగా ఇంటి ఎదుటఉన్నవారు కుమారులకు సమాచారం అందించారు. మంచం మీద నుంచి కింద పడి మృతిచెంది ఉండవచ్చని భావించిన కుటుంబ సభ్యులు, బంధువులు అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటికే బాలవ్వ ముక్కు నుంచి రక్తం కారుతుంది. శవాన్ని దించుతుండగా మృతురాలి తల కిందఉన్న దిండు జారి కిందపడింది. దానిపై రక్తం మరకలు కనిపించాయి. అంత్యక్రియలు పూర్తి చేసి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటిలో కూడా రక్తం మరకలు ఉన్నాయి. అనుమానం వచ్చి మృతురాలి కుమారులు నాగరాజు, పరుశరాములు ఈనెల 16న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ కృష్ణ, ఎస్‌ఐ గంగరాజు ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఆదివారం పూడ్చిన శవాన్ని బయటకు తీసి అక్కడే తహసీల్దార్ జయంత్, ఫోరెనిక్స్ బృందం ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానిత నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



మృతురాలు బాలవ్వ (ఫైల్)

వ్యక్తి అదృశ్యం



సాయిలు(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): వ్యక్తి అదృశ్యమైన కేసు పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన గుల్లరి సాయిలు(38) ఈ నెల 14న ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లాడు. తిరిగిరాక పోవడంతో భార్య మంజుల బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సాయిలు మానసిక స్థితి సరిగా లేదని ఆమె తెలిపింది. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొమురవెల్లిలో టూరిజం చైర్మన్ పూజలు



కొమురవెల్లిలో గెల్లు శ్రీనివాస్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామివారిని తెలంగాణ టూరిజం శాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త బుచ్చిరెడ్డి, ఏర్పుల మహేష్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో..



నాగరాజు(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రం వెల్దుర్తిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన వడ్ల నాగరాజు(37)కు భార్య మాధవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతులిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మాధవి మూడేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఐదు రోజుల క్రితం అత్తగారింటికి వచ్చిన ఆమె.. రెండు రోజులకే మళ్లీ పుట్టింటికి వెళ్లిపోయింది. శనివారం వెల్దుర్తిలో ఇరువురి కుటుంబ సభ్యులు భార్యభర్తల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశారు. ఇంట్లో అందరూ ఉండగానే పక్కకు వెళ్లిన నాగరాజు గడ్డిమందు సేవించి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. అతను నాటకం ఆడుతున్నాడని ఆస్పత్రికి తరలించకుండా మూడు గంటల పాటు కాలయాపన చేశారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు 108కు సమాచారం అందించి తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందాడు. మృతుడి సోదరి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని ఆటో బోల్తా..

- తల్లీకొడుకుకు తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): లారీ ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడిన ఘటనలో తల్లీకొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం కొండపాక మండలం దుద్దెడ శివారులో హరిత హోటల్ సమీపంలో రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేర్యాల మండలం వేచరేణికి చెందిన ఆటో ప్రయాణికులను ఎక్కించుకుని సిద్దిపేట నుంచి చేర్యాలకు వెళ్తుంది. ఈక్రమంలో నంగునూర్ మండలం మైసంపల్లికి చెందిన తల్లీకొడుకు కుసుంభ మల్లవ్వ, రాజేశ్వర్‌రావులు చేర్యాలకు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. హరిత హోటల్ సమీపంలో రాగానే సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి అందులో ఉన్న మల్లవ్వకు కుడి చేయి, రాజేశ్వర్‌రావుకు ఎడమ చేయి విరిగాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవరు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంట్లో గొడవపడి..



సత్యనారాయణ (ఫైల్)

టేక్మాల్(మెదక్): అప్పుల బాధతో ఇంట్లో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన టేక్మాల్ మండలం వెంకటాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన ఇంటి సత్యనారాయణ(32) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు అమ్మాయిలు. అప్పుల విషయంలో భార్య భర్తలు గొడవ పడేవారు. ఈనెల 16న ఉదయం కూడా వారిద్దరు గొడవ పడ్డారు. మనస్తాపానికి గురైన సత్యనారాయణ గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు ఐరావతం అవార్డు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని తిమ్మారెడ్డి పల్లి గ్రామ మాజీ సర్పంచ్ భూర్గోజు బాలబ్రహ్మం ఐరావతం జాతీయ పురస్కారం 2023, జ్యోతిర్వాస్తు విద్వాన్ బిరుదుకు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు, తెలంగాణ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌చారి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. బాలబ్రహ్మం జ్యోతిష్యంలో వాస్తు పురోహిత శుభ కార్యాలు చేయడంలో జిల్లాలో పేరు పొందారు. కార్యక్రమంలో నిత్య నిర్మలానంద స్వామి, నాగపాణి శర్మ, రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తునికి నల్లపోచమ్మదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారి దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ సాయిలు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

చాముండేశ్వరీ అమ్మవారికి..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారు మంజీరా తీరంలో వెలిసిన చాముండేశ్వరీ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాల వితరణ చేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

నర్సాపూర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నిరవధిక సమ్మె ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరింది. నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మె చేస్తున్నారు. వారికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు సంఘీభావం తెలిపారు. సమ్మెలో అంగన్‌వాడీ టీచర్స్, ఆయాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఇతర ప్రతినిధులు విజయ, ఫరీదా, ఇందిర పాల్గొన్నారు.

కొల్చారం: మండంలోని రంగంపేటలో అంగన్ టీచర్లు అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం వంటావార్పు నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, పద్మ, విజయలక్ష్మి, ఏసమ్మ, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

కొండపాక(గజ్వేల్): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. బంధువుల ఇంట్లో జరిగిన దశదిన ఖర్మకు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కొండపాక మండలం రాంపల్లి గ్రామానికి చెందిన చిట్టాల రాములు (52) జగదేవ్‌పూర్ మండలం మునిగడప గ్రామంలో బంధువు చనిపోగా దశదిన ఖర్మకు వెళ్లి బైక్‌పై తిరిగివస్తుండా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో వ్యవసాయ పొలం నుంచి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా చుక్కారెడ్డి నర్సింహారెడ్డి (80) అనే వృద్ధుడిని ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ కొండపాక మండలం మర్పడగ మదిర నాగిరెడ్డిపల్లికి చెందిన నర్సింహారెడ్డి దినచర్యలో భాగంగా ఈ ఘటన చోటుచేసుకుంది.

అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా

రంగనాయక సాగర్



గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్ రావు

- లింగారెడ్డిపల్లి రూట్‌లో రూ.60కోట్లతో ఫోర్‌లేన్ రోడ్డు
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: రాబోయే రోజుల్లో రంగనాయక సాగర్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు లింగారెడ్డిపల్లిలో పద్మశాలి, ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించి, కుమ్మరి, కమ్మరి, విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేటకు అన్ని దిక్కులా రూ.60కోట్లతో 4 వరుసల రోడ్డు ఇప్పటికే నిర్మించామని తెలిపారు. లింగారెడ్డిపల్లిలో రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. నాలుగు వరుసల రహదారికి 100 ఫీట్ల స్థలం అవసరం కానీ, గ్రామంలో ఇళ్లు దెబ్బతింటున్నాయని 80 ఫీట్ల రోడ్డు రేణుకా ఎల్లమ్మ గుడి నుంచి మెట్టుబండల వరకు సెంట్రల్ లైటింగ్‌తో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామన్నారు. చింతల్ చెరువు కింద బ్రిడ్జి నిర్మించడం జరుగుతుందన్నారు. లింగారెడ్డిపల్లిలో ఇప్పటికే బస్తీ దవాఖానా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని కులాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని, రంగనాయక సాగర్‌లో పల్లగుట్టపై రూ.110 కోట్లతో డెస్టినేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

దసరాలోపు వెయ్యి పడకల ఆస్పత్రి

సిద్దిపేట ఏన్సాన్‌పల్లి శివారులో నిర్మిస్తున్న వెయ్యి పడకల ప్రభుత్వ ఆస్పత్రిని దసరా పండగ లోపు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఆస్పత్రిలో 150 మంది వైద్యుల ద్వారా క్యాన్సర్‌తో పాటు అన్ని రకాల వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. కేసీఆర్ కిట్లు, రైతు బంధు, రైతు బీమా, పింఛన్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా లింగారెడ్డిపల్లికి చెందిన మాల, విశ్వ బ్రాహ్మణ, శాలివాహన, కుమ్మరి, వడ్డెర సంఘాలు రాబోయే శాసన సభ ఎన్నికల్లో హరీష్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని తీర్మాన పత్రాలను అందజేశారు.

మహిళల పేరిట అన్ని పథకాలు

సిద్దిపేటజోన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సంక్షేమ పథకాలను మహిళల పేరిట మంజూరు చేయాలని నిర్ణయించిందని, వారికి నేరుగా ఇవ్వడం వల్ల ప్రతి పైసా సద్వినియోగం అవుతుందని సీఎం కేసీఆర్ నమ్మకమని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం స్థానిక కొండ భూదేవి గార్డెన్స్‌లో నియోజకవర్గ పరిధిలోని గృహలక్ష్మి పథకం కింద 800 లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖాళీ స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం మూడు లక్షలు సాయం చేయాలని, అది మహిళల పేరిట ఇవ్వాలని సీఎం కేసీఆర్ స్వయంగా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కల్యాణ లక్ష్మి పథకం కూడా మహిళల పేరిట మంజూరు చేసిన విషయం గుర్తు చేశారు.

ఆత్మనూన్యతతో ఉండొద్దు

సిద్దిపేటజోన్: మహిళలు సహనంతో అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఆత్మ నూన్యతతో ఉండొద్దని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం స్థానిక విపంచి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర మహిళ సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న కిశోర బాలికలకు రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆకుల లలిత తో కలిసి మంత్రి హరీశ్ రావు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

శంకరమఠం సోలార్ సిస్టం ప్రారంభం

సిద్దిపేటఅర్బన్: మండలంలోని కిష్టసాగర్‌లో గల శృంగేరి శంకరమఠంలో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టంను ఆదివారం మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. సౌరశక్తిని వినియోగించుకోవడం వల్ల పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన వాళ్లమవుతామని మంత్రి అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజిత, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం, రాజనర్సు, కనకరాజు, రామచంద్ర రావు, మోహిజ్, తిరుమాల్, శ్రీహరి, సుందర్, మల్లికార్జున్, రఘురాం, సురేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.